క్లుప్తంగా

న్యాల్‌కల్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం



డిచ్‌పల్లి (మోపాల్) : మోపాల్ మండలం న్యాల్‌కల్ గ్రామస్తుల వినతికి స్పందించిన ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు సోమవారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించారు. నిజామాబాద్ నుంచి న్యాల్‌కల్ గ్రామం మీదుగా సిర్పూర్, ముదక్‌పల్లి, బాడ్సి వరకు బస్సు రాకపోకలు సాగిస్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. అడిగిన వెంటనే బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యేకు న్యాల్‌కల్, సిర్పూర్ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



జక్రాన్‌పల్లి : మండలంలోని అర్గుల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ కుంచాల విమల సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోర్త పద్మ, ఉప సర్పంచ్ గోర్త రాజేందర్, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ నర్సారెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు అక్బర్‌ఖాన్, జైడి భాస్కర్‌రెడ్డి, వార్డు సభ్యులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపి




ధర్పల్లి : పిల్లలకు ప్రతిరోజూ ఇంటి వద్ద వ్యాయామాలు చేయిస్తే ఫలితం ఉంటుందని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ధర్పల్లి మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో తెలంగాణ సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి తదితరులు ఉన్నారు.

నర్సరీ పనుల పరిశీలన



జక్రాన్‌పల్లి : మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి, తొర్లికొండ గ్రామాల్లో కొనసాగుతున్న నర్సరీ మొక్కలు పెంపకం పనులను ఎంపీడీవో లక్ష్మణ్ సోమవారం పరిశీలించారు. మొక్కల పెంపకానికి అవసరమైన చర్యలు తీసుకోవా లని సిబ్బందికి సూచించారు. తొర్లికొండలో పల్లెప్రకృతి వనం, ఫార్మేషన్ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్‌లు మాదరి లత దేవరాజ్, అక్కపత్రి సురేశ్, టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన రోడ్డు పనులు



సిరికొండ : మండలంలోని గోప్యతాండ గ్రామ పంచాయతీలో సీసీ రోడ్డు పనులను జెడ్పీటీసీ మాన్‌సింగ్ సోమవారం ప్రారంభించారు. ఐదు లక్షల నిధులతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంచందర్, కొండాపూర్ సర్పంచ్ రమేస్, తూంపల్లి సొసైటీ వైస్ చైర్మన్ అబ్బాస్, డైరెక్టర్ చందర్, రాజేందర్, లస్కర్, బాలకిషన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

ఖలీల్‌వాడి : నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోర్గాం(పి) చెందిన దేవునిసాగర్(16) అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పదో తరగతి చదువుతున్న దేవుని సాగర్ ఈనెల 15న స్కూల్ నుంచి మధ్యాహ్నమే ఇంటికి రావడంతో తల్లిదండ్రులు మందలించారన్నారు. ఆ సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయిన సాగర్ ఇప్పటి వరకు తిరిగి రాలేదని, చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సాగర్ తండ్రి సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే నాల్గో టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి
- మోపాల్ మండలంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర



మోపాల్‌లో హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

డిచ్‌పల్లి(మోపాల్) : అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మోపాల్ మండలం న్యాల్‌కల్, సిర్పూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్‌పార్టీ జెండా ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల మాయ మాటలు నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు ఇప్పుడు వారి ప్రజా వ్యతిరేక విధానాలకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.400 లు ఉండగా ఇప్పుడు రూ.1150 కి చేరిందన్నారు. విద్యార్థులు ఉపయోగించే వస్తువులపై కూడా 15 శాతం జీఎస్టీ విధించడం ప్రధాని మోడీ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. తెలంగాణ లో ధరణి అమలు లోకి తెచ్చి ఒకరి భూమిని మరొకరి పేరిట నమోదు చేసి రైతులను, పేదలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గ్యాస్ సిలిండర్‌ను రూ.500 లకే అందజేస్తామన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రలో చెప్పిన విధంగా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి ని రద్దుచేస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఇస్తామని, 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా, రుణమాఫీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రూరల్ ఇంచార్జీ డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కే.నాగేష్‌రెడ్డి, గడుగు గంగాదర్, నగర అధ్యక్షుడు కేశ వేణు, అర్బన్ ఇంచార్జీ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా కిసాన్‌కేత్‌అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, సీనియర్ నాయకులు శేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు రవి, నాయకులు యాదగిరి, ఎల్లయ్య, కుమార్, ఎంపీటీసీ రఘు, పిట్ల రవి, ఎండీమక్దూమ్, తిరుపతి, సుభాష్, నరేష్; యూసుఫ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి



ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరికొండ : మహిళా సంఘాల సభ్యులకు జీవనోపాధి కోసం వడ్డీలేని రుణాలు ఇవ్వాలని ప్రగతిశీల మహిళ సంఘం(పీవోడబ్ల్యూ) డివిజన్ అధ్యక్షురాలు పిట్ల రమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని స్త్రీశక్తి కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ రాష్ట్రంలో 1,81,295 సంఘాల్లో 19లక్షల పేద మహిళలు సభ్యులుగా ఉన్నారని, మహిళలు బ్యాంకులు నుంచి తీసుకుంటున్న అప్పులకు 12 శాతం వడ్డీ చెల్లించడం వల్ల ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. అభయహస్తం పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఇన్‌చార్జి ఏపీఎం సత్యానంద్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధ్యక్షులు మానస, కార్యదర్శి పుష్పలత, జమున, గంగామణి, స్వరూప, సుశీల, ఐఎఫ్టీయు నాయకులు రమేష్, ప్రజాపంథా నాయకులు రమేష్, అనీస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి



రుద్రూర్(పోతంగల్) : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని భవిష్యత్తులో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీనర్సయ్య అన్నారు. పోతంగల్ మండలం కారేగాంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజాగోస బీజేపీ బరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మా ల్యాద్రి రెడ్డి, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొత్తకొండ భాస్కర్, కో కన్వీనర్ గుత్ప భూపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు కాపుగాండ్ల శ్రీనివాస్, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.రుద్రూర్ మండలం బొప్పాపూర్‌లో ప్రజాగోసా బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని ఆదివా రం రాత్రి ఏర్పాటు చేశారు. బాన్సువాడ సెగ్మెంట్ బీజేపీ ఇన్‌చార్జి మాల్యాద్రి రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలకు ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు.

పసుపు, ఎర్రజొన్న రైతులను ఆదుకోవాలి



మోర్తాడ్(బాల్కొండ): పసుపు, ఎర్రజొన్నలను సాగు చేసిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఛైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ పెద్దల వైఫల్యాల వల్లే పసుపు పంటకు ధర లేకపోవడం, ఎర్రజొన్నలు సాగు చేసిన రైతులతో దళారులు ఆటలాడుకోవడం జరుగుతుందని ఆయన ఆరోపించారు. సోమవారం ఆయన మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ రైతు సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎర్రజొన్నలకు మొన్నటి వరకు ధర ఉందని ఊదరగొట్టిన వ్యాపారులు ఇప్పుడు తమ లాభాలను పెంచుకోవడానికి ధర తగ్గించడం ఎంత వరకు న్యాయం అన్నారు. ఎర్రజొన్నలకు సంబంధించి సిండికేట్‌కు నాయకత్వం వహిస్తున్న ప్రధాన వ్యాపారి బీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారు అని ఆరోపించారు. ఎర్రజొన్నలకు ధర లభించేలా కలెక్టర్‌కు పురమాయించిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి చర్యను తాము స్వాగతిస్తున్నామన్నారు. ఎర్రజొన్నలకు రూ.4వేలు, పసుపు పంటకు రూ.15వేల ధర లభించేలా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఎంపీ అర్వింద్ మాట తప్పి రైతులను నట్టేటా ముంచారని ఎద్దేవా చే శారు. ఈనెల 23న నిజామాబాద్ మార్కెట్‌ను ముట్టడించనున్నామన్నారు.

అనాథలను చేరదీయడం హర్షణీయం



చికిత్స అనంతరం వృద్ధురాలితో జడ్జి పద్మావతి తదితరులు

ఖలీల్‌వాడి : అనాథలకు అండగా నిలుస్తున్న ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. 20 రోజులు క్రితం ఆర్మూర్‌లో అనారోగ్యంతో కదల్లేని స్థితిలో రెండు కళ్లు కనపడక ఉన్న అనాథ వృద్ధురాలిని ఇందూరు యువత స్వచ్ఛంద సంస్థ సభ్యులు గుర్తించారన్నారు. అనంతరం ఆమెను జీజీహెచ్‌కు తరలించి, చికిత్స అనంతరం వృద్ధురాలు యాదమ్మ(65)కు కంటి ఆపరేషన్ చేయించి సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శాస్త్రినగర్‌లోని వృద్ధాశ్రమానికి తరలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తూ వృద్ధులకు అండగా నిలుస్తున్న ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ జడ్జి పద్మావతి, సఖి కేంద్ర భానుప్రియ, న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తం, స్వధార్ హోం శ్రీదేవి, ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, కార్యవర్గ సభ్యులు కాసుల సాయి తేజ, రామేశ్వర్ రెడ్డి, సఖి కేంద్ర టీం, తదితరులు పాల్గొన్నారు.

లొంకలో ముగిసిన జాతర



లొంకలో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు




అల్లుబండపై అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న భక్తులు

సిరికొండ : జిల్లాలో ప్రసిద్ధ శైవ పుణ్య క్షేత్రమైన లొంకలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు జరిగిన జాతర సోమవారంతో ముగిసింది. చివరి రోజు కూడా మహేశ్వరుడి దర్శనం కోసం భక్తులు భారీగానే తరలివచ్చారు. కోనేరులో స్నానాలు ఆచరించి సైకత లింగంను దర్శించుకొని పూజలు చేశారు. నాగరాజు శర్మ ఆధ్వర్యంలో పురోహితుల బృందం మహశివుడికి అభిషేకాలు, అన్నపూజలు జరిపారు. భక్తుల సౌకర్యార్థం మండల కేంద్రం నుండి ఆర్టీసీ బస్సులను నడిపారు. ఆలయం వద్ద గల అల్లుబండపై భక్తులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. మూడు రోజుల్లో లక్ష వరకు భక్తులు లొంకను దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు గంగాధర్, భూపతిరాజు, సంతోష్, మారుతి, గోపి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రాజ్‌కుమార్, రవి, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం

- నాబార్డు సహకారంతో సంస్థ ఏర్పాటు
- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

నిజామాబాద్ నాగారం : నాబార్డ్ సహకారంతో రైతులే స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న సంస్థ నాబ్కాన్స్ అని దీని ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయన్ని పొందవచ్చని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్‌హాల్‌లో నాబార్డు, నాబ్కాన్స్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, రైతులు పండించే పంటల ఉత్పత్తికి కావాల్సిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సేంద్రియ పదర్థాలు తక్కువ ధరలు అందిస్తారన్నారు. సమగ్ర సస్యరక్షణ విధానాలను ప్రోత్సహించడం ద్వారా సాగులో ఖర్చులు తగ్గి రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. ఇందు కోసం జిల్లాలోని రైతులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తారన్నారు. మొదటగా నాబ్కాన్స్ చైర్మన్, డైరెక్టర్లు, అకౌంటెంట్ వారికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెట్టి ఈ స్కీం ద్వారా రైతుల పెట్టుబడి తగ్గించి ఆదాయం పెంచే లాకృషి చేయాలన్నారు. ప్రస్తుతం మనకు ఆయిల్ ఫామ్ లో అనేక లాభాలు ఉన్నాయి ఈ పంట 4 సంవత్సరాల తర్వాత ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి ఎలా జీతం వస్తదో అదే విధంగా రైతు కూడా ఆర్థిక అభివృద్ధి సాదించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో నబ్కాన్ జిల్లా అధికారులు రాకేష్, రాజలింగం, అకౌంటెంట్ థామస్ మోదీ, ఎఫ్‌పీఓ డైరెక్టర్లు, సీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

మౌంటెన్స్ క్రికెట్‌లో క్రీడాకారుల ప్రతిభ



జాతీయస్థాయి మౌంటెన్స్ క్రికెట్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

నిజామాబాద్ నాగారం : తెలంగాణ మౌంటెన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి పోటీలు ఈ నెల 17 నుంచి 19వరకు వరంగల్ జిల్లాలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారు. జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు విజేతగా నిలవడంలో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటారు. ఈ సందర్భంగా తెలంగాణ మౌంటెన్స్ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ కైలాస్ యాదవ్, సెక్రటరీ కంచు శ్రీనివాస్, ఉప కార్యదర్శి బండారి సంతోష్ ప్రత్యేకంగా అభినందించారు. ఇందులో జిల్లా ప్రెసిడెంట్ అబ్బాగోని అశోక్ గౌడ్, వాయిస్ ప్రెసిడెంట్ సంజీవ్, సెక్రటరీ బి మహేష్, ఉప కోశాధికారి దత్తు అభినందించారు.

ఫిల్మ్ ఫెస్టివల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి) : రాష్ట్రీయ కళామంచ్ ఆధ్వర్యంలో మార్చి 18, 19వ తేదీల్లో ముంబైలో జరిగే 'నేషనల్ స్టూడెంట్స్ ఫిల్మ్‌ఫెస్టివల్ (ఎన్‌ఎస్‌ఎఫ్‌ఎఫ్)ను వర్సిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ సూచించారు. ఫిల్మ్ ఫెస్టివల్ పోస్టర్లను ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని, ఏబీవీపీ నాయకులతో కలిసి వీసీ రవీందర్ సోమవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాష్ట్రీయ కళామంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత, కళలను వెలికి తీసేందుకు ఏబీవీపీ కల్పిస్తున్న గొప్ప అవకాశం ఎన్‌ఎస్‌ఎఫ్‌ఎఫ్ అని ప్రశంసించారు. జాతీయ భావం, దేశభక్తి అనే అంశాల పై షార్ట్ ఫిలిమ్స్, డాక్యుమెంటరీ ఫిలిమ్స్ తీసి ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తమ ప్రతిభను చాటాలన్నారు. ఆసక్తి ఉన్న 35 ఏళ్ల లోపు ఉన్న విద్యార్థులు రూ.999 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈనెల 25 లోపు www. nsff. in వెబ్‌సైట్ ద్వారా తమ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్‌కమిటీ మెంబర్ బచ్చబోయిన శివ తెలిపారు. ఫస్ట్ ప్రైజ్ రూ.లక్షతో పాటు రూ. 3 లక్షల వరకు స్పెషల్ కేటగిరీ అవార్డ్స్ ఉంటాయన్నారు. పోస్టర్ల ఆవిష్కరణలో ఏబీవీపీ నాయకులు నవీన్, సాయికుమార్, ప్రమోద్, సాయికృష్ణ, ప్రసాద్, సచిన్ పాల్గొన్నారు.



నేషనల్ స్టూడెంట్స్ ఫిల్మ్ ఫెస్టివల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్

బాలికల వసతి గృహం నిర్మించాలి



వీసీకి వినతిపత్రం ఇస్తున్న బీవీఎం ప్రతినిధులు

తెయూ(డిచ్‌పల్లి) : వర్సిటీ మెయిన్ క్యాంపస్, డిచ్‌పల్లిలో వెంటనే నూతన బాలికల వసతి గృహం నిర్మించాలని భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విఠల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెయూ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బాలికలకు ఒకటే వసతి గృహం ఉండడం వల్ల పీజీ, లా, ఇంటిగ్రేటెడ్ పీజీ విద్యార్థినులకు గదులు సరిపోవడం లేదన్నారు. ఒక్కో గదిలో సుమారు 8 నుంచి 10 మంది విద్యార్థినులు ఉండాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే క్యాంపస్‌లో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించాలంటే సరైన భవనం లేదని, క్యాంపస్ ఆవరణలో ఆడిటోరియం నిర్మిస్తే సమస్య తీరుతుందన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ తరగతులు నిర్వహించాలన్నారు. వీసీ ని కలిసిన వారిలో బీవీఎం నాయకులు రమణ, సూరజ్, రవి తదితరులున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సెర్ప్ రిసోర్స్ పర్సన్ వెంకట్

డిచ్‌పల్లి : ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడీ) మధుసూదన్ సూచించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ)లో సోమవారం జిల్లాలోని 17 మండలాల నుంచి ఎంపిక చేసిన ఐకేపీ సీఏ లకు ఆర్థిక అక్షరాస్యతపై ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మధుసూదన్, సెర్ప్ రిసోర్స్ పర్సన్ వెంకట్ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో డబ్బు ప్రాధాన్యత తెలిసి ఉండాలన్నారు. శిక్షణ పొందిన సీఏ లు గ్రామాలకు వెళ్లి స్వయం సహాయక సంఘాల మహిళలతోపాటు గ్రామస్తులందరికీ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం నీలిమ, ఎఫ్ఎల్‌సీసీ మురళీమోహన్, ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, కే.రామకృష్ణ, ఎం.నవీన్, ఎం.రంజిత్ తదతరులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలివ్వాలి

బోధన్ : పాదుపు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, అభయ హస్తం పథకాన్ని యథావిధిగా అమలు చేయడాలని డిమాండ్ చేస్తు సోమవారం ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ పాదుపు మహిళా సంఘాల సభ్యులు ర్యాలీ, ఆర్డీవో ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరంఆర్డీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	57,850	వెండి (కిలో)	69,400
22 క్యారెట్స్	53,326	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	18	30	క్యాప్సికం	35	50
బెండకాయ	50	80	గాజరుగడ్డ	20	40
బీరకాయ	50	60	పచ్చిమిర్చి	25	40
దొండకాయ	25	40	దోసకాయ	20	40
బీర్నిసుకాయ	25	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	35	50	గోబిగడ్డ	10	20
వంకాయ	10	20	గోబిపువ్వు	20	40
పాలకూర	10	20	బీట్‌రూట్	20	40
మెంతికూర	20	40	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	40	60
పుదీనా	40	60			- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సెడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్-1- సార్- 10.30,1.30,4.30,7.30 10.20
స్క్రీన్-2- వినరో భాగ్యము విష్ణుకథ-10.50
యాంటీ-మేన్ అండ్ ది వాస్ (ఇంగ్లీష్)-1.40,10.30
షెహజాదా(హిందీ)-4.40,7.40
స్క్రీన్-3- వినరో భాగ్యము విష్ణు కథ-1.30, 7.40,10.30
యాంటీ-మేన్ అండ్ ది వాస్(ఇంగ్లీష్) -4.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1- యాంటి-మేన్ అండ్ ది వాస్ (ఇంగ్లీష్) -10.50,4.50,7.40 ,10.30
యాంటీ-మేన్ అండ్ ది వాస్(తెలుగు) -1.40
స్క్రీన్-2 - సార్ -10.20,4.00,7.00,10.00
రైటర్ పద్మభూషన్-1.20
స్క్రీన్-3- షెహజాదా(హిందీ)-10.00,4.10 7.20,10.30 - సార్ -1.10
స్క్రీన్-4- వినరో భాగ్యము విష్ణు కథ -10.15 4.30,10.45
- పఠాన్ -హిందీ-1.15 7.30

దేవి	సార్
నటరాజ్	యాంట్-మేన్ అండ్ ది వాస్ప్
లలితామహల్	వాల్తేరు వీరయ్య
శ్రీదేవి	ధమాకా
విజయ్	వినరో భాగ్యము విష్ణు కథ